
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కర్నూలు

జిల్లా వార్తలు

సోమవారం 24 జూన్ 2024



- అధికారం మాటున వైసీపీ నేతల బరితెగింపు
- కేఎంసీ, కుడా అనుమతులు లేకుండానే భవన నిర్మాణం
- గతేడాది ఆగస్టు 7న వెలుగులోకి తెచ్చిన ఆంధ్రజ్యోతి
- కళ్లకు గంతలు కట్టుకున్న అధికారులు
- ప్రభుత్వం మారడంతో ఈ నెల 17న ప్లాన్ అనుమతి కోసం దరఖాస్తు
- సరైన ధ్రువపత్రాలు లేవని వెనక్కి పంపిన కుడా

రాష్ట్రంలో అక్రమ భవనాలు ఉండడానికి వీల్లేదు. అలాంటి వాటిని మా ప్రభుత్వం ఉపేక్షించదు. ప్రజా వేదిక కూడా అలాంటి నిర్మాణమే కాబట్టి కూల్చేస్తున్నాం.

- వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలో గొప్పగా చెప్పుకున్న మాటలు ఇవి



వైసీపీ ప్యాలెస్‌పై చర్యలేవీ..?

గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం అప్పటి సీఎం చంద్రబాబు నిర్మించిన ప్రజావేదిక కూల్చివేత వరకు ఆ హడావుడి చేశారు. ఆ తరువాత ఏ ఒక్క అనధికార నిర్మాణాలను తొలగించలేదు. పైగా అధికారం ఉంది కదా అని వైసీపీ జిల్లా కార్యాలయాల నిర్మాణం కోసం రూ.వందల కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలను లీజు పేరిట కారుచౌకగా కొట్టేశారు. నగర పాలిక సంస్థ, కుడా అనుమతులు లేకుండానే అక్రమ నిర్మాణాలు చేపట్టారు. వైసీపీ నేతలు బరితెగించి చేపట్టిన ఆ పార్టీ అక్రమ నిర్మాణాన్ని 2023 ఆగస్టు 7న ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. అప్పట్లో ఏ ఒక్క అధికారి కూడా స్పందించలేదు. ఏడాది గడిచింది. భవన నిర్మాణం చివరి దశకు చేరింది. ప్రభుత్వం మారడంతో భయం పట్టుకున్న వైసీపీ అధిష్ఠానం హడావుడిగా ప్లాన్ అప్రూవల్ కోసం ఆన్‌లైన్‌లో కుడాకు దరఖాస్తు చేసింది. పలు ధ్రువపత్రాలు లేకపోవడంతో ఆ దరఖాస్తును అధికారులు తిరస్కరించారు. వైసీపీ కార్యాలయం అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి మరి.



విశాలమైన సమావేశ భవనం

కర్నూలు, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరం నడిబొడ్డున రైల్వే స్టేషన్ రోడ్ ఫైవ్ రోడ్స్ జంక్షన్ (ఐదు రోడ్ల కూడలి)లో రూ.100 కోట్లకు పైగానే విలువైన సర్వే నంబరు 95/2బీలో ఏపీ స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీ ఆగ్రోస్ సంస్థ)కు చెందిన 1.60 ఎకరాలు భూమిని ఏడాదికి రూ.1,600 చెల్లించేలా 33 ఏళ్ల లీజు పేరిట కారుచౌకగా దక్కించుకున్నారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ (కేఎంసీ), కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే ప్యాలెస్‌ను తలదన్నేలా వైసీపీ జిల్లా కార్యాలయం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పుడు వైసీపీ అధికారంలో ఉండడంతో అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నారు. అధికారం మాటున భవన నిర్మాణం శరవేగంగా చేపట్టారు. అయితే ప్రస్తుతం అధికారం మారింది. సీఎం చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. అక్రమ భవన నిర్మాణం ఎక్కడ తమ మెడకు చుట్టుకుంటుందోనని అధికారులు భయందోళన చెందుతున్నారు.

ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చినా..!

వైసీపీ జిల్లా కార్యాలయం అక్రమ భవన నిర్మాణంపై 2023 ఆగస్టు 7న ఆంధ్రజ్యోతి 'అధికార పార్టీనా మజానా..! శీర్షికన వెలుగులోకి తెచ్చింది. డాక్యుమెంట్ ప్రకారం 6,375.24 చదరపు మీటర్ల విస్తర్ణం ఉంటే.. అందులో అప్పటికే గ్రౌండ్ ఫ్లోర్, తొలి అంతస్తు నిర్మాణం (బిల్డప్ ఏరియా) 1,679.15 చదరపు మీటర్లు విస్తీర్ణంలో ప్యాలెస్‌ను తలదన్నేలా భవన నిర్మాణం చేపట్టారు. ఎలాంటి అనుమతులు లేకుండానే పునాదులు తీసి.. పిల్లరు వేసేందుకు అవసరమైన ఇనుప కడ్డీలు ఏర్పాటు చేశారు. శరవేగంగా పనులు జరుగుతున్నా అటువైపు ఏ అధికారి కూడా వెళ్లడానికి సాహసం చేయలేదు. ఆ సమయంలో అక్రమ నిర్మాణంపై ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. ఎక్కడా తమ మెడకు చుట్టుకుందో..? అని నగర పాలక సంస్థలో కీలక హోదాలో ఉన్న ఓ అధికారి సూచనల మేరకు 2023 ఆగస్టు 31న రూ.10 వేలు చెల్లించి కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ (కేఎంసీ)కి దరఖాస్తు చేసి యథావిధిగా పనులు కొనసాగించారు. ఆ తరువాత అదే ఏడాది డిసెంబరులో డెవలప్‌మెంట్ చార్జి, పర్మిట్, గ్రీన్, డీపీఎంఎస్ యూజర్ చార్జీలు చెల్లించి వదిలేశారు. అయితే పూర్తిస్థాయిలో అవసరమైన ఫీజులు, ధృవపత్రాలు జమ చేయకపోవడంతో ఆ దరఖాస్తును కూడా పరిగణలోకి తీసుకోలేదు. దీంతో ఆన్‌లైన్ కాకపోవడంతో అప్రూవల్ కూడా ఇవ్వలేదు.





కర్నూలు ఫైవ్ రోడ్స్ జంక్షన్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా రుషికొండ ప్యాలెస్ తరహాలో రెండు అంతస్తుల్లో వైసీపీ కార్యాలయం నిర్మాణం

రైల్వే స్టేషన్ రోడ్ ఐదు రోడ్ల కూడలిలో ఆగ్రోస్ స్థలంలో చేపట్టిన వైసీపీ ఆఫీసు నిర్మాణం. 2023 ఆగస్టు 5 నాటికి పిల్లర్లు వేసేందుకు సిద్ధం చేసిన ఇనుప కడ్డీలు (ఫైల్)



ప్రభుత్వం మారడంతో ప్లాన్ అనుమతికి దరఖాస్తు

అధికారం మాది.. రాబోయే అధికారం కూడా మాదే.. మమ్మలను ప్రశ్నించేది ఎవరంటూ వైసీపీ నాయకులు యథేచ్ఛగా వైసీపీ ఆఫీసు భవనం అక్రమంగా నిర్మాణం చేపట్టారు. గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణాలు దాదాపుగా పూర్తి అయ్యాయి. వైసీపీ నేతల కలలు చెదిపోయేలా ప్రజలు తీర్పు ఇవ్వడంతో ఈ నెల 12న టీడీపీ కూటమి ప్రభుత్వం కొలుదీరింది. ప్రభుత్వం మారడంతో ప్లాన్ అనుమతుల కోసం హడావుడిగా ఈ నెల 14న లేబర్ సెస్ కాంపోనెంట్-1, కాంపోనెంట్-2 ఫీజు రూ.2.85 లక్షలు, పెనాల్టీ రూ.10 వేలు చెల్లించి ఈ నెల 17న ఆన్‌లైన్‌లో కుడాకు దరఖాస్తు చేశారు. హడావుడిలో ఎన్‌ఓసీ, ఎఫ్ఎంబీ, తహసీల్దారు జారీ చేసిన పొజిషన్ సర్టిఫికెట్, ఈసీ వంటి ధ్రువపత్రాలు జత చేయకపోవడంతో ఆ దరఖాస్తును వెనక్కి పంపినట్లు కుడా వైస్ చైర్మన్ ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ నెల 18న 'కర్నూలులో వైసీపీ ప్యాలెస్' శీర్షికన వెలుగులోకి తెచ్చింది. మొత్తం మీద ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి అక్రమ భవన నిర్మాణాలపై చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి.



వైసీపీ ఆఫీసు భవనం లోపలి భాగం

దరఖాస్తును వెనక్కి పంపాం

వైసీపీ కార్యాలయం 1,679.15 చదరపు మీటర్ల విస్తీర్ణంలో చేపట్టారు. ఎలాంటి అనుమతులు లేవు. ఈ నెల 17న ప్లాన్ అప్రూవల్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. ఎన్‌ఓసీ, ఎఫ్ఎంబీ, తహసీల్దారు జారీ చేసిన పొజిషన్ సర్టిఫికెట్, ఈసీ వంటి ధ్రువపత్రాలు లేకపోవడంతో వెనక్కి పంపించాం. అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టిన వైసీపీ ఆఫీసు నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కేఎంసీ కమిషనర్‌కు లేఖ రాశాను. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందుకెళ్తాం.

- ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి, కుడా వైస్ చైర్మన్, కర్నూలు

ఇకపై 'మీ కోసం'

- కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- ప్రజల నుంచి ప్రతి సోమవారం అర్జీల స్వీకరణ



కర్నూలు(కలెక్టరేట్), జూన్ 23: జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై తెలుగుదేశం ప్రభుత్వం దృష్టి సారించింది. అందుకు తెలుగుదేశం ప్రభుత్వం తొలి అడుగులో భాగంగా మీకోసం.. ప్రజల సమస్యల పరిష్కార వేదిక అనే పేరుతో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తోంది. బాధితులు సమస్యలపై అర్జీ ఇచ్చేందుకు తప్పనిసరిగా ఆధార్, ఫోన్ నెంబరు కలిగి ఉండాలి. అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఒక సంఖ్యను అధికారులు అర్జీదారునికి ఇస్తారు. దీని ఆధారంగా సమస్య పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకునే అవకాశం ఉంటుంది. అర్జీదారుడు ఫోన్ లేకపోతే రక్తసంబంధీకులకు చెందిన ఫోన్ నెంబరును నమోదు చేసుకోవచ్చు. జిల్లాలోని ప్రతి సోమవారం జిల్లా, మండల, మున్సిపల్ కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసింది. వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్పందన తూతూ మంత్రంగా కొనసాగింది. ప్రజల సమస్యలను పరిష్కరించాలని అర్జీలు ఇస్తే వైసీపీ నాయకులు అర్జీదారుడుపై దాడులు చేశారు. ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులే వైసీపీ ఏజెంట్లు అధికారులుగా చలామణి అయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఓడించారు. కూటమి అధికారంలోకి రావడంతో మీకోసం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

నేటి నుంచి అర్జీల స్వీకరణ:

కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డా.జీ.సృజన ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రాయలసీమ అభివృద్ధిపై ప్రభుత్వానికి నివేదిస్తాం

కర్నూలు(కల్చరల్), జూన్ 23: రాయలసీమ అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై నూతన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజా సంఘాలతో కూడిన ఒక సమగ్ర నివేదిక అందిస్తామని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని బిర్లా గేటు సమీపంలోని డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి ఆసుపత్రి సమావేశ హాలులో నాలుగు జిల్లాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ప్రజా సంఘాల వేదిక నాయకుడు రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు. ఈ ఏడాది జూలై మొదటి వారంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, నీటి పారుదల శాఖ మంత్రి, ఇతర అధికారులను కలిసి, సమస్యలకు సంబంధించిన సమగ్ర నివేదికను సమర్పించాలని నిర్ణయించారు. శ్రీశైలం ప్రాజెక్టు నీటిమట్టం 854 అడుగులు ఉండేలా కృష్ణా నది యాజమాన్య బోర్డు రూపొందించిన రూల్‌కర్వ్‌ను అమలు పరచాలని, విభజన చట్టంలో రాయలసీమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, దుమ్ముగూడెం నాగార్జునసాగర్ టైల్ పాండ్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని, రాయలసీమ సాగునీటి హక్కులను కాలరాస్తూ గత ఏడాది అక్టోబరులో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రాజ్యాంగ విరుద్ధ చట్టాన్ని రద్దు చేయాలని, బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీని కరువు పీడిత రాయలసీమకు వర్తించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలని బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. అలాగే కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయం కర్నూలులో ఏర్పాటు చేయాలని, చెరువుల అభివృద్ధికి ప్రత్యేక ఇరిగేషన్ కమిషన్ ఏర్పాటు చేయాలని, సిద్దేశ్వరం అలుగు నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలని కోరారు. రాయలసీమలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి కార్యాలయాలను కర్నూలులోనే యథావిధిగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక సమస్యలను ఎమ్మెల్యేల దృష్టికి తీసుకు వెళ్తున్నామని సమావేశంలో నాయకులు ప్రకటించారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు వాడాల చంద్రశేఖర్‌రెడ్డి, డేవిడ్, శ్రీనివాసులు, రామ్‌కుమార్, వెంకటేశ్, రాహుల్, రత్నం ఏసేపు, సుంకన్న, సుబ్బరాయుడు, శేషగిరి, శివశంకర్, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి



భక్తి పారవశ్యం

- జనసంద్రమైన కోసిగి తిమ్మప్ప కొండ
- ఆంజనేయ స్వామిని దర్శించుకున్న భక్తులు

కోసిగి కొండపై తిమ్మప్ప స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



కోసిగి, జూన్ 23: ఏరువాక పౌర్ణమి మరుసటి రోజు కోసిగిలోని తిమ్మప్పకొండపై వెలసిన తిమ్మప్ప స్వామి (ఆంజనేయస్వామి)ని దర్శించుకోవడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆదివారం కోసిగిలోని తిమ్మప్ప కొండపైకి చీమలదండుగా భక్తులు వేలాదిగా తరలిరావడంతో ఆ ప్రాంతమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. ముందుగా భక్తులు తిమ్మప్పస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొండపై ఉన్న గాలిమరలు, గాలిపడ దగ్గర నిల్చుని కోసిగి చుట్టూ ఉన్న అందాలని తిలకించారు. కోసిగితో పాటు పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున యువకులు, మహిళలు పిల్లలు వేలాదిగా తరలిరావడంతో తిమ్మప్పకొండ పరిసర ప్రాంతమంతా భక్తజనసందడి మారింది. ఈ ఏడాది తిమ్మప్ప కొండపై భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారనీ ఆలయ పూజారులు తెలిపారు. గతంలో తిమ్మప్ప కొండపై చిరుత పులులు సంచరిస్తున్నాయని తెలియడంతో రెండేళ్లలో కొండపైకి వెళ్లేందుకు ప్రజలు భయపడేవారు. కానీ ఈఏడాది మాత్రం వేలాదిమంది కోసిగి వాసులు కొండపైకి వెళ్లి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.



కోసిగిలో తిమ్మప్పకొండ ఎక్కుతున్న భక్తులు

అందాలను తిలకిస్తున్న ప్రజలు



బదిలీల గుబులు



కర్నూలు(న్యూసిటీ), జూన్ 23: పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో బదిలీల గుబులు లేపుతోంది. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడంతో బదిలీలు అనివార్యమైనట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే తమ స్థానలను పదిలం చేసుకునేందుకు కొందరు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో వైసీపీ నాయకులకు అంటకాగిన అధికారులు మంత్రులు ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నాయకులను ప్రసన్నం చేసుకునేందుకు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా కర్నూలు పీఆర్ఐ ఈఈగా వచ్చేందుకు కొందరు ఈఈలు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

ఇక్కడ పని చేసిన వారే..

గతంలో జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో డీఈలుగా విధులు నిర్వహించిన ఐదుగురు ఈఈలకు పదోన్నతి లభించి రాష్ట్రంలోని పలు జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో సుబ్బరాజు(నెల్లూరు) కేవి సుధాకర్ గౌడు(నెల్లూరు), జి.మల్లికార్జున(కాకినాడ), వైసీ సుబ్బరాయుడు(పల్నాడు) ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఒకరిద్దరు ఈఈలు ఉమ్మడి జిల్లాకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. జిల్లా ప్రస్తావన వస్తే ఇతర జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న ఐదుగురిలో ముగ్గురు, ప్రస్తుతం ఇక్కడ విధులు ఇర్వహిస్తున్న ముగ్గురిలో ఇద్దరు ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన వారు ఉన్నారు. జీవో విడుదలైతే బదిలీల ప్రయత్నాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఏదేమైనా ఈ

నెలాఖరులో పదవీ విరమణలు..

పీఆర్ ఇంజనీరింగ్ విభాగంలో ఈ నెలాఖరులో ఇద్దరు అధికారులు పదవీ విరమణ పొందనున్నారు. కర్నూలు సూపరింటెండెంట్ ఇంజనీర్ కే సుబ్రమణ్యం, ఆదోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.వెంకటప్రసాద్‌తోపాటు ఇద్దరు డీఈలు, ఏఈలు పదవీ విరమణ చేయనున్నట్లు తెలుస్తోంది. ఎస్ఈ పోస్టును పదోన్నతుల్లో భాగంగా భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయి. ఇక ఉద్యోగుల బదిలీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జీరో సర్వీసును అమలు చేస్తే ఉమ్మడి కర్నూలు జిల్లాలోని నాలుగు ఈఈ పోస్టుల్లోకి వచ్చేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారు. ఆదోని ఈఈ పోస్టు క్లియర్‌గా ఉన్న, నంద్యాల పీఆర్, పీఐయూ ఈఈ పోస్టులకు ఇప్పటికే పలువురు దక్కించుకునే ప్రయత్నంలో ఉన్నారు. కర్నూలు ఎస్ఈ పోస్టుకు కూడా పలువురు ఇతర జిల్లాల నుంచి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో గతంలో పీఐయూ ఈఈగా ఇక్కడ విధులు నిర్వహించిన విజయకుమారి ప్రస్తుతం విజయవాడలో పని చేస్తున్నారు. ఆమె ఇక్కడికి రానున్నట్లు సమాచారం.

● పంచాయతీరాజ్‌లో పైరవీలు

నెలాఖరులకు పలువురు ఇంజనీర్లకు స్థానం చలనం తప్పదనే ప్రచారం ఉంది. కర్నూలు డివిజన్ పీఆర్ఐ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఎస్ఈ టు పీఏ శ్రీనివాసులుకు వచ్చే అవకాశం ఉంది.

సీఈ పోస్టుకు ప్రయత్నాలు

కర్నూలు సూపరింటెండెంట్ ఇంజనీరు కే సుబ్రమణ్యం ఈ నెలాఖరున పదవీ విరమణ పొందనున్నారు. అయితే ఈయనకు చీఫ్ ఇంజనీర్‌గా పదోన్నతి వచ్చే అవకాశం ఉంది. సీఈల పదోన్నతుల జాబితాలో ఈయనే పేరు మొట్టమొదటగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా, అడవుల శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్‌ను కలిసేందుకు విజయవాడ వెళ్లినట్లు తెలిసింది. అయితే సుబ్రమణ్యం కంటే ముందు వరుసలో ఉండే ఎస్ఈ కొండయ్య ప్రకాశం జిల్లాలో పని చేస్తూ గత నెల 31న పదవీ విరమణ పొందారు. దీంతో సుబ్రమణ్యంకు ఎలాంటి పోటీ లేదు.

భర్తను హతమార్చిన భార్య

- దంపతుల మధ్య ఘర్షణ
- కత్తెరతో పొడిచిన భార్య
- నంద్యాల పట్టణంలో దారుణం



మృతి చెందిన వెంకటేష్

నంద్యాల (నూనెపల్లె), జూన్ 23: నంద్యాల సుద్దులపేటలో కట్టుకున్న భర్తను ఓ మహిళ కత్తెరతో పొడిచి హత్య చేసింది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల మేరకు.. నంద్యాల టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుద్దుల పేటకు చెందిన వెంకటేష్ (42) ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. 20 ఏళ్ల క్రితం మమతతో వెంకటేష్‌కు వివాహం జరిగింది. భర్త వెంకటేష్, మద్యానికి బానిస కావడంతో ఇద్దరి మధ్య నిత్యం ఘర్షణలు చోటు చేసుకునేవి. ఇదిలా ఉండగా మమత వరుసకు బావతో సన్నిహితంగా ఉండటంతోనే వెంకటేష్ మద్యానికి బానిసయ్యాడని అతడి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఇద్దరి మధ్య పెద్దల సమక్షంలో ఎన్నో సార్లు పంచాయతీలు చేసినా తిరిగి గొడవపడేవారని తెలిపారు. ఈ క్రమంలో శనివారం వెంకటేష్ మద్యం తాగి ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో దంపతులు మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. భర్తపై భార్య విచక్షణా రహితంగా దాడికి పాల్పడటంతో వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వెంకటేష్ ఆదివారం ఇంటికి వెళ్లిపోయాడు. ఆదివారం మళ్లీ భార్య భర్తల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆగ్రహంతో ఊగిపోయిన మమత ఇంట్లో ఉన్న కత్తెరతో భర్త వెంకటేష్ ఛాతీపై పొడిచింది. స్థానికులు వెంకటేష్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో ఆయన మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టూటౌన్ సీఐ రాజారెడ్డి ఆసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. నిందితురాలు మమతను పోలీసులు అదుపులోకి తీసుకున్నాడు. కాగా మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు.



ఆసుపత్రిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రాజారెడ్డి

ఆకాశంలో అల్లం ధర

ఆందోళనలో వినియోగదారులు



మార్కెట్లో అమ్ముడవుతున్న అల్లం

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 23: మార్కెట్లో ఇప్పటికే వివిధ రకాల కూరగాయల ధరలు కొండెక్కి కూర్చోగా అల్లం ధర ఆకాశానికి చేరింది. బహిరంగ మార్కెట్లో అల్లం ధర రూ.250 నుంచి రూ.280 వరకు విక్రయిస్తుండటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మాంసం ప్రియులకు చికెన్, మటన్ ధరలు చుక్కలు చూపిస్తుండగా, అల్లం ధర మరింత భారంగా మారింది. ఆదివారం, మంగళవారం వచ్చిందంటే చాలు మాంసం లేనిదే అత్యధిక మందికి ముద్ద దిగని పరిస్థితి. అయితే మసాలా వంటకాల్లో అల్లం వాడకం తప్పనిసరి. దీంతో గతంలో రూ.5, 10 వెచ్చిస్తే కొంత ముక్క దొరికే అల్లం, ప్రస్తుతం రూ.20, 40 వెచ్చించినా సరిపోవడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. వర్షాభావ పరిస్థితులు, తెగుళ్ల కారణంగా అల్లం దిగుబడి తగ్గి పోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ముగిసిన న్యాయాధికారుల సదస్సు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్.శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్), జూన్ 23: త్వరలో రానున్న మూడు కొత్త క్రిమినల్ చట్టాలపై రెండు రోజుల న్యాయాధికారుల అవగాహన సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ న్యాయాధికారులు ఈ చట్టాల పట్ల అవగాహన కలిగి కక్షిదారులకు సత్వర న్యాయం అందించాలని ఆయన కోరారు. ఈ సదస్సులో జిల్లాలోని అందరు న్యాయాధికారులతో పాటు అదనపు జిల్లా న్యాయాధికారులు వాసు, మురళీకృష్ణ, పాండురంగారెడ్డి, ప్రతిభాదేవి, భూపాల్ రెడ్డి, ఏవో రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 23: మండల కేంద్రంలో ఆదివారం ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. సాయిబాబా ఆలయం పక్కనే నివసిస్తున్న కుమ్మరి సుబ్రమణ్యం భార్య కుమ్మరి గంగా శ్రావణి(30) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. సుబ్రమణ్యం వృత్తిరీత్యా కూరగాయల కొనుగోళ్ల కోసం ఆదివారం మధ్యాహ్నం తాడిపత్రికి వెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చే సరికి ఇద్దరు చిన్న పిల్లలు ఏడుస్తూ కనిపించారని, లోపలికి వెళ్లి చూడగా తన భార్య ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించిందని మృతురాలి భర్త సుబ్రమణ్యం వాపోయాడు. విషయం తెలుసుకున్న కొలిమిగుండ్ల సీఐ గోపినాథ్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రొద్దుటూరుకు చెందిన శ్రావణితో గత 12 సంవత్సరాల క్రితం సుబ్రమణ్యంకు వివాహం జరిగింది. శ్రావణి మృతితో ఇద్దరు చిన్న పిల్లలు అనాథలుగా మారారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు విచారణలో వెలుగు చూస్తాయని సీఐ తెలిపారు.

ట్రాక్టర్ క్రింద పడి యువకుడి మృతి

క్రిష్ణగిరి, జూన్ 23: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన యువకుడు బోకుల్ సింక్(20) ఆదివారం మృతి చెందాడు. శనివారం సాయంత్రం కట్టల కోసం బోకుల్ సింక్, దునై అనే యువకులు ట్రాక్టర్‌లో వెళ్లారు. కంబాలపాడు-పెనుమాడ గ్రామాల మధ్యలో ఉన్న బావి సమీపంలో కట్టెలు ఏరుకుంటుండగా రివర్స్‌లో ట్రాక్టర్ బోకుల్ సింక్‌పైకి దూసుకెళ్లింది. తీవ్ర గాయాలపాలవడంతో బోకుల్ సింక్ మృతి చెందాడు. మండలానికి చెందిన విద్యుత్ కాంట్రాక్టర్ దగ్గర ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన యువకులు ఐదు నెలలుగా విద్యుత్ పనులు చేస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఖాజా వలి తెలిపారు.

ఆర్యవైశ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం

హాస్టల్ ప్రారంభోత్సవంలో మంత్రి టీజీ భరత్



హాస్టల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు(కల్చరల్), జూన్ 23: ఆర్యవైశ్యులకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని నంద్యాల రోడ్డులో ఉన్న టీజీ లక్ష్మీ వెంకటేశ్ వాసవి వైశ్య హాస్టల్ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయనతోపాటు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ దంపతులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు. టీజీ భరత్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఆర్యవైశ్యులంటే రోశయ్య తర్వాత టీజీ వెంకటేశ్ గుర్తొస్తారని అన్నారు. విద్యార్థులకు వైశ్య హాస్టల్‌ను ప్రారంభించం సంతోషంగా ఉందని అన్నారు. తమ సేవలు ఎప్పటికీ కొనసాగుతూనే ఉంటాయని తెలిపారు. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ తాను మొదటి నుంచి ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తూనే ఉన్నానని అన్నారు. గతంలో ఈ ప్రాంతంలో ఆర్యవైశ్యులను బానిసలుగా చూసేవారని, దివంగత నాయకుడు రోశయ్యతో కలిసి ఆర్యవైశ్యుల సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. ఆర్యవైశ్యులను బానిసలుగా చేసే నాయకులకు గుణపాఠం చెబుతూ వైశ్యులకు తగిన గౌరవం కల్పించినట్లు గుర్తు చేశారు. చదువుకున్న వారికి ఉద్యోగాలు, చదువులేని వారికి ఉపాధి కల్పించి ఆదుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఆర్యవైశ్యుల ఆస్తులను పలువురు కాజేసేందుకు కుట్రలు చేస్తున్నారని, అలాంటి వారి నుంచి ఆస్తులను రక్షించి ఆర్యవైశ్య కమ్యూనిటీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తూనే ఉన్నామని అన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా ఆర్యవైశ్యులందరూ ఒక కుటుంబంలా ఉండాలని టీజీ వెంకటేశ్ కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సీనియర్ నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, దేవకి వెంకటేశ్వర్లు, సిద్దా నాగేశ్వరరావు, పెనుగొండ సుబ్బరాయుడు, ఇల్లూరు లక్ష్మయ్య, టీజీ శివరాజ్, అమరవాది లక్ష్మీనారాయణ, కోటా సత్యనారాయణ, రజని, శబరి వరప్రసాద్, రాయపూడి గణేశ్ పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖలో ఫెవికాల్ వీరులు



వైసీపీ అధికారంలోకి రావడంతో వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులతో అంటకాగి విద్యుత్ ఉద్యోగుల్లో ఆందోళన



కల్లూరు, జూన్ 23: ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యుత్‌శాఖలో ఫెవికాల్ వీరులు ఎక్కువైపోయారు. ఏళ్ల తరబడి సీటుకు అతుక్కుపోయి విద్యుత్ శాఖలో చక్రం తిప్పుతున్నారు. వివిధ క్యాడర్లలో 25 మందికి పైగా అధికారులు ఉన్నట్లు విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. సాధారణ ఎన్నికల అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో విద్యుత్‌శాఖ అధికారుల్లో ఆందోళన మొదలైంది. గత ప్రభుత్వంలో అధికారులు వైసీపీకి తొత్తులుగా వ్యవహరించి జిల్లాలో సుదీర్ఘకాలం కొనసాగుతున్న ఉద్యోగులను బదిలీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు సమాచారం. అప్పటి వైసీపీ ప్రభుత్వంలో అధికార పార్టీ నాయకుల సేవలో తరించిన ఉద్యోగులు తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు ఇచ్చిన ప్రతిపాదనలపై కనీసం స్పందించకపోవడంతో వారు ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో మళ్లీ జిల్లాలో కొనసాగేందుకు ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫార్సుల కోసం చెప్పులరిగేలా తిరుగుతున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు సదరు విద్యుత్ శాఖ ఉన్నతాధికారి వ్యవహార శైలిపై పెదవి విరిచినట్లు సమాచారం.

● **పదోన్నతి వస్తేనే ఇక్కడి నుంచి వెళతా.:** రాష్ట్రంలో జరిగిన సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ 164 శాసనసభ స్థానాలు ...న్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ బదిలీ అవుతారని అధికారులు, ఉద్యోగుల్లో తీవ్రచర్చ జరుగుతోంది. దీంతో కోపోద్రిక్తుడైన ఉన్నతాధికారి ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎవరూ ఎస్ఈ బదిలీపై మాట్లాడవద్దని ఇటీవల టెలీకాన్ఫరెన్స్‌లో సైతం ఉద్యోగులపై విరుచుకుపడినట్లు సమాచారం. ఆ మాటకు వస్తే ఇక్కడి నుండి పదోన్నతి వస్తేనే వెళతానని..లేదంటే రాజీనామాకు సిద్ధమని పలువురు అధికారులు, ఉద్యోగుల వద్ద వ్యక్తపరిచినట్లు విశ్వసనీయ సమాచారం.

మాజీ మంత్రి అండతో ఎస్ఈగా నియామక ఉత్తర్వులు

కర్నూలు జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈగా 2022 ఆగస్టు 30న వెంకటసుబ్బయ్య బాధ్యతలు స్వీకరించారు. గంటల వ్యవధిలో డోన్ డీఈగా పని చేస్తున్న ఎం.ఉమాపతిని తిరుపతి ఎస్ఈగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఆ విధంగా కర్నూలు ట్రాన్స్‌కో ఎస్ఈలుగా మధ్యాహ్నం ఒకరు.. రాత్రి 7 గంటలకు ఇంకొకరు ఒకే రోజు ఇద్దరు బాధ్యతలు స్వీకరించారు. అప్పటి వైసీపీ మంత్రి అండదండలతో, రాజకీయ పలుకుబడితో పట్టుబట్టి మరి ఆయన కర్నూలు ఉమ్మడి జిల్లా ఎస్ఈగా విధుల్లో చేరినట్లు ఉద్యోగుల్లో తీవ్ర చర్చ జరిగింది. మంత్రికి అత్యంత సన్నిహితుడిగా మారిన సదరు అధికారి విద్యుత్ శాఖలో కొనసాగుతున్నట్లు సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఔషధ శాఖ ఏడీ సస్పెన్షన్ ఎత్తివేత

కర్నూలు(హాస్పిటల్), జూన్ 23: జిల్లా ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ ఏడీ ఏటీపీ రమాదేవి సస్పెన్షన్‌ను ఎత్తివేశారు. గత నెల ఎన్నికల విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారన్న కారణంతో కలెక్టర్ సిఫారసు మేరకు ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ డైరెక్టర్ ఆఫ్ జనరల్ ఏడీని సస్పెండ్ చేశారు. కలెక్టర్ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఆదేశించడంతో ఏడీ సస్పెన్షన్‌ను డైరెక్టర్ ఆఫ్ జనరల్ ఎత్తివేశారు. ఈ మేరకు జిల్లా ఔషధ శాఖ ఏడీ రమాదేవి సోమవారం విధుల్లో చేరనున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోడుమూరు (రూరల్), జూన్ 23: గోరంట్ల హంద్రీనది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ బాలనరసింహులు తెలిపారు. సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించనట్లు తెలిపారు. దాడిలో ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించామని అన్నారు. డ్రైవర్లు రామక్రిష్ణాపురానికి చెంది న కేశన్న, షేక్షావలి ఆలంకొండకు చెందిన సుధాకర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చిరుద్యోగులపై వివక్ష

- అప్కాస్ పేరిట కోత
- ఇకనైనా న్యాయం జరిగేనా?

ఆలూరు, జూన్ 23: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఔట్ సోర్సింగ్, పార్ట్ టైం విధానంలో పని చేస్తున్న ఉద్యోగులు, వర్కర్లకు వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాల్లో కోత విధించింది. దీంతో సంక్షేమ పథకాలు అందకపోవడంతో ప్రభుత్వ తీరుపై చిరుద్యోగులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు...

● అప్కాస్ పేరుతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కోత...

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏపీ కార్పొరేషన్ ఫర్ ఔట్ సోర్సింగ్ (అప్కాస్)ను ఏర్పాటు చేసి కార్పొరేషన్ ద్వారా వేతనాలు చెల్లిస్తూ వచ్చారు.. అయితే అప్కాస్‌లో ఉన్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జాబితా తీసుకున్న వైసీపీ ప్రభుత్వం అమ్మఒడితోపాటు ఇంట్లో ఎవరైనా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉంటే, వారందరికీ ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు నిలిపివేయడంతో తీవ్ర ఆందోళన చెందారు.. చాలీచాలని వేతనంతో జీవనం సాగిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతోపాటు మరోవైపు పార్ట్ టైం వర్కర్స్‌ది కూడా ఇదే పరిస్థితి.. ఔట్ సోర్సింగ్, ఉద్యోగుల ఇళ్లలో భార్య, భర్త, తల్లి లేదా కుమారుడు ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా ఉంటే వారికి ప్రభుత్వం ఇచ్చే వృద్ధ, వికలాంగుల పెన్షన్లను కూడా తొలగించారు. ఆన్‌లైన్‌లో వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా చూపడంతో అవాక్కయ్యారు.. విద్యాశాఖలో అధికంగా ఉన్న కంప్యూటర్ ఆపరేటర్లు, వార్డెన్లు, స్వీపర్లు, వాచ్‌మెన్లు, అటెండర్లు, కుక్స్‌ల పిల్లలకు సైతం అమ్మఒడి పథకానికి అనర్హులయ్యారు. అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయింది.. రూ.10వేలు వేతనం తీసుకుంటున్న వారికీ ఈ పథకాలు నిలిపివేశారు.. అదే ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు విధానంలో పని చేస్తూ నెలకు రూ.30 వేల నుంచి 40వేల వరకు వేతనం అందుకుంటున్న జూనియర్ లెక్చరర్లు, నర్సులు, కంప్యూటర్ ఆపరేటర్లుకు మాత్రం సంక్షేమ పథకాలు అమలు అవడం విశేషం.

టీడీపీ ప్రభుత్వంపై ఆశలు

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో ఆశలు చిగురించాయి.. అమ్మకు వందనం పథకం పేరిట ఇంట్లో ఎంతమంది చదువుతున్నారో వారందరికీ రూ.15వేల చొప్పున ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టడంతో తమకు కూడా వర్తిస్తుందనే ఆశతో ఉన్నారు.. ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించి సంక్షేమ పథకాలు మాకు కూడా వర్తించేలా చూడాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు విష్ణు, సుధారాణి, సుమలత, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రమేష్ కోరుతున్నారు.

ఊరూరా.. మద్యధార!







కోడుమూరు, జూన్ 23:

పల్లెలన్నీ మద్యం మత్తులో జోగుతున్నాయి. విచ్చలవిడిగా బెల్టుషాపులు ఏర్పాటు చేయడంతో మద్యం విక్రయాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయిస్తూ జనాల జేబులు గుల్ల చేస్తున్నా ఎక్సైజ్ అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడడం లేదు. ఇళ్లలోనే దర్జాగా మద్యం విక్రయిస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ పాలనలో మందుబాబులు ఎక్కడంటే అక్కడ మద్యం సేవించినా చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మద్యం కొనుగోలు చేసిన కొందరు ఆ సమీపంలోని రోడ్లు, దుకాణాలు, పొలాలు, కల్వర్టులు దగ్గర తాగేస్తున్నారు. దీంతో అటువైపు వెళ్లే మహిళలు, పిల్లలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలోనైన పోలీసులు మద్యం షాపుల దగ్గర పహారా ఏర్పాటు చేసి మందుబాబుల అరాచకాలకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం

ఇబ్బందులకు గురవుతున్న చిన్న పిల్లలు, మహిళలు

పట్టించుకోని పోలీసులు

చర్యలు తీసుకోవాలని డిమాండ్



బార్‌లను తలపిస్తున్న కూల్ డ్రింక్ షాపులు : కోడుమూరు పట్టణంలో ఎమ్మిగనూరు, వెల్దుర్తి, కర్నూలుకు వెళ్లే ప్రధాన రహదారుల పక్కనే మద్యం షాపులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వైసీపీ ప్రభుత్వం ఆదాయం కోసం మద్యం షాపులను ఏర్పాటు చేసింది. కానీ తాగేందుకు మందుబాబులకు పరిమిట్ రూంలను ఏర్పాటు చేయలేదు. దీంతో మందుబాబులకు మద్యం షాపుల పక్కనే ఉన్న కూల్‌డ్రింక్ షాపులు, రోడ్ల పక్కనే కుర్చోవడంతో ఆ ప్రాంతంలో నిత్యం జాతర వాతావరణం కనిపిస్తుంది. పోలీసులు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వాళ్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మద్యం షాపుల నుంచి బెల్ట్‌లకు మద్యం సరఫరా

గతంలో మద్యం వ్యాపారులు తమ వ్యాపారాన్ని పెంచుకునేందుకు మద్యాన్ని బెల్ట్ షాపలకు సరఫరా చేసే వాళ్లు. వైసీపీ పాలనలో ప్రభుత్వమే మద్యం షాపులను ఏర్పాటు చేసి అందులో ప్రైవేటు వ్యక్తులకు వేతనం ఇచ్చి సేల్స్‌మేన్లు, సూపర్‌వైజర్లు నియమించి మద్యంను విక్రయిస్తుంది. దీంతో సేల్స్‌మేన్లు, సూపర్‌వైజర్లు బెల్టు షాపు వ్యాపారస్తులతో కుమ్మక్కై క్వాటర్ సీసాపై రూ.10 చొప్పున పెంచి మండలంలోని బెల్టు షాపులకు మద్యాన్ని తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వ మద్యం షాపులో పని చేసే వ్యక్తులు గడిచిన 5 సంవత్సరాల్లో రూ.లక్షలు సంపాదించారు.

తాగుబోతులకు అడ్డా... చికెన్ ఫ్రై సెంటర్లు

కోడుమూరు పట్టణంలో 50కి పైగా చికెన్ ఫ్రై సెంటర్లు ఉన్నాయి. తాగుబోతులకు అడ్డాగా చికెన్ ఫ్రై సెంటర్ల మారాయి. వ్యాపారస్తులు బయట చికెన్ ఫ్రై కాల్చుతూ కనిపిస్తారు. చికెన్ ఫ్రై పేరులో మందుబాబులకు తాగడానికి వసతి ఏర్పాటు చేసి వాళ్లకు కావాల్సిన చికెన్ వండి ఇస్తుంటారు. ముందు భాగంలో చికెన్ వంటకాలు చేస్తూ వెనకభాగంలో మద్యం సేవించేందుకు మందుబాబులకు స్థలం ఏర్పాటు చేసి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఈ విషయం పోలీసులకు తెలిసినప్పటికీ ఏమి పట్టించుకోవడంమ లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యపాన నిషేధం



బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వాళ్లను కేసులు నమోదు చేస్తున్నాం. చికెన్ ఫ్రై సెంటర్ల పై కూడా దాడులు చేస్తాం. మందుబాబులకు మ ద్యం సేవించేందుకు షెల్టర్లు ఇచ్చే వాళ్లపై కఠిన చర్యలు తీసుకొంటాం. బెల్టు షాపులపై కూడా నిఘా ఉంచాం. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదు.

- బాలనరసింహులు, ఎస్ఐ కోడుమూరు

దాడి చేసిన దుండగులను అరెస్టు చేయాలి

కర్నూలు(న్యూసిటీ), జూన్ 23: నిరుపేద దళితరాలు గిరిగింజ హనుమక్కపై విచక్షణా రహితంగా దాడి చేసిన దుండగులను అరెస్టు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. వెల్దుర్తి మండలం రత్నపల్లె గ్రామంలో దాడికి గురై ప్రాణభయంతో బుదవారపేటలోని కూతురి నివాసంలో తలదాచుకుంటున్న హనుమక్కను ఆదివారం సమితి సభ్యులు పరామర్శించారు. ఆనంద్ బాబు మాట్లాడుతూ దాడి చేసిన దుండగులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు విజయమ్మ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్‌కు అభినందనలు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 23: పార్లమెంటులో తెలుగుదేశం పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా నంద్యాల పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరిని నిమించడంతో అభినందనలు తెలిపినట్లు నంద్యాల టీడీపీ నాయకులు, ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటరామరాజు తెలిపారు. నంద్యాల ఎంపి బైరెడ్డి శబరిని నియమించడం పట్ల టీడీపీ అధినేత,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

సాగు నీటి ప్రాజెక్టులు, పరిశ్రమలపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

కర్నూలు(న్యూసిటీ), జూన్ 23: జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు,పరిశ్రమల ఏర్పాటుపై నూతన ప్రభుత్వం దృష్టి పెట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. ఆదివారం కార్మిక కర్షక భవన్‌లో జరిగిన సీపీఎం జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరి మాటలు చెబుతూ పోవడం కాకుండా నూతన ప్రభుత్వమైనా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చించి ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తి చేసి జిల్లాకు సాగు,తాగునీటి సమస్యలను సంపూర్ణంగా పరిష్కరించాలన్నారు. 2019లో శంకుస్థాపన చేసిన గుండ్రేవుల, వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువల నిర్మాణం పూర్తి చేయాలని అన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి.ఆనంద్‌బాబు, పీఎస్.రాధాక్రిష్ణ, కేవి.నారాయణ, రామాంజనేయులు, ఎండి.అంజిబాబు, అలివేలమ్మ, అరుణమ్మ పాల్గొన్నారు.

ఏపీజీజేసీఎల్ఎస్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా నాయకల్లు సుంకన్న

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 23: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లైబ్రేరి అండ్ అసోసియేషన్ (ఏపీజీజేసీఎల్ఎస్) రాష్ట్ర జనరల్ సెక్రటరీగా నాయకల్లు సుంకన్న ఎన్నికయ్యారు. రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని జూమ్ మీటింగ్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లైబ్రరీ సైన్స్ అధ్యాపకులకు కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతులు కల్పించాలన్నారు. పదోన్నతులు సాధించేందుకు రాష్ట్ర కమిటీ ద్వారా పోరాటాలు చేసి సాధిస్తామని తెలిపారు. తనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం పట్ల అభినందనలు తెలియజేశారు.

రవాణా శాఖమంత్రికి అభినందనలు



మంత్రికి అభినందనలు తెలుపుతున్న నాగేంద్ర

కర్నూలు(అర్బన్), జూన్ 23: రాష్ట్ర రవాణా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర అభినందనలు తెలిపారు. ఆదివారం విజయవాడలోని సెక్రటేరియట్‌లో మంత్రిగా బాధ్యతలు తీసుకున్న ఆయన్ను కలిసి శాలువతో అభినందించారు. రాష్ట్రంలో మెరుగైన పాలన ఒక్క తెలుగుదేశం అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని, ఆయన నాయకత్వంలో యువతకు ప్రాధాన్యత లభించండం పట్ల రాష్ట్రంలో అభివృద్ధి ఇక శరవేగంగా ముందుకు సాగుతుందన్నారు.

వైసీపీ అక్రమ ప్యాలెస్ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

● చంద్రబాబుకు రాష్ట్ర కార్యదర్శి ఫిర్యాదు



చంద్రబాబుతో మాట్లాడుతున్న నాగేశ్వరరావుయాదవ్

కర్నూలు(అర్బన్), జూన్ 23: కర్నూలు నరగంలో వైసీపీ అక్రమంగా నిర్మించిన కట్టడాలపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరరావు యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం వద్ద సీఎం. చంద్రబాబును కలిసి వినతి పత్రం ద్వారా కోరారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున్న ప్రభంజనం సృష్టించిన తీరు.. ప్రజల్లో వైసీపీపై ఎంత వ్యతిరేకత ఉందో అర్థమైందన్నారు. విధ్వంసమైన పాలనను గాడిలో పెట్టి రాష్ట్రాభివృద్ధి, అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే చంద్రబాబు నాయకత్వం అవసరమని ప్రజలు గుర్తించారని తెలిపారు. కర్నూలు నగరంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఆగ్రోస్ కార్పొరేషన్‌కు చెందిన కోట్ల విలువైన భూముల్లో ప్యాలెస్ నిర్మించడాన్ని విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

కర్నూలు(అర్బన్), జూన్ 23: కేంద్రలో మూడోసారి అధికారం చేపట్టిన మోదీ ప్రభుత్వం వెంటనే బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని బీసీ జేఏసీ కన్వీనరు బత్తుల లక్ష్మీ కాంతయ్య డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని బీసీ భవన్‌లో బీసీ హక్కులు - సాధన అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ పితామహుడు బ్రహ్మశ్రీ రావు సాహెచ్ పండిత 88వ వర్ధంతి కార్యాక్రమం జరిగింది. కార్యక్రమంలో యల్లయ్య ఆచారీ, నాగేశ్వరాచారీ, శ్రీరాములు, పుల్లయ్య ఆచారీ, రామయ్య ఆచారీ, సత్యనారాయణ ఆచారీ, శివప్రసాద్ ఆచారీ, ప్రహ్లాదాఆచారీ తదితరులు పాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 23: ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగానికి గొడ్డలిపెట్టుగా మారిన జీవో.నెం.117ను రద్దు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.గోకారి, టికే జనార్దన్, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవన కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గోకారి అధ్యక్షతన జిల్లా ద్వితీయ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జీవో.117ను రద్దు చేసి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను యథావిధిగా కొనసాగిస్తామని, ప్రస్తుత మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విలీనాన్ని రద్దు చేసి 1 నుంచి 5వ తరగతి వరకు పాత పద్ధతిలో కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మాత్రమే పరిమితం చేయడం ద్వారా విద్యార్థుల సంఖ్యను పెంచవచ్చని తెలిపారు. కోర్టు కేసులకు ఆస్కారం లేకుండా డీఎస్సీ నియామకాలు చేపట్టాలని కోరారు. పీఆర్సీ అమలు ఆలస్యం అవుతున్నందున 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షులు నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నాగరాజు, ఆర్థిక సభ్యులు సుంకన్న, నాగరాజు, రామ్మోహన్ రెడ్డి తదితర ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గొప్ప జాతీయవాది శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ



కల్లూరు: శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు



కర్నూలు ఎడ్యుకేషన్: శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

కల్లూరు, జూన్ 23: జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ గొప్ప జాతీయవాది అని బీజేపీ నేషనల్ హార్టీకల్చర్ బోర్డు డైరెక్టర్ సింగం సోమశేఖర్‌రెడ్డి, నంద్యాల జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు తారకేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ 79వ వర్థంతి సందర్భంగా చెన్నమ్మసర్కిల్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యనిర్వహణ అధికారి చామకూర వీరప్ప మాట్లాడుతూ బీజేపీ మూల పురుషుడు, జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మోహనాచారి, రవికుమార్, శారద, వీరమ్మ, జగదీస్ పాల్గొన్నారు.

కర్నూలు(ఎడ్యుకేషన్): స్థానిక పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం డా.శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజు, రిటైర్డు ప్రిన్సిపాల్ కొట్టె చెన్నయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో బీజేపీ నాయకులు మీసాల గంగాధర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కన్వీనర్ నటేష్ కుమార్, శ్రీనివాసు, రామ్మోహన్ రెడ్డి, మద్దిలేటిరెడ్డి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక 10వ వార్డు ఇన్‌చార్జి డేరంగుల లక్ష్మీనారాయణ, కేఎస్ భగవత్ ఆధ్వర్యంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సందడి సుధాకర్, సారాయి రంగస్వామి, రామస్వామి, అంబలి కాశీవిశ్వనాథ్, శ్రీరాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు(కల్చరల్): ఒకే జెండా, ఒకే రాజ్యాంగం ఉండాలని, కాశ్మీరు భారతదేశంలో అంతర్భాగమని నినదించిన మహనీయుడు డాక్టర్ శ్యామ్ ప్రకాశ్ ముఖర్జీ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర కొనియాడారు. ఆదివారం నగరంలోని నరసింహారెడ్డినగర్‌లోగల బీజేపీ కార్యాలయంలో శ్యామ్‌ప్రకాశ్ ముఖర్జీ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీనాయుడు, బీజేపీ కోడుమూరు అసెంబ్లీ కోకన్వీనర్ వేల్పుల గోపాల్, బీజేపీ జిల్లా కోశాధికారి లోకేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఒలంపిక్ డే రన్



ఒలింపిక్ రన్‌లో పాల్గొన్న మాజీ మంత్రి టీజీ వెంకటేశ్, క్రీడా సంఘాల ప్రతినిధులు

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 23: కలెక్టరేట్ నుంచి కొండారెడ్డి బురుజు వరకు ఒలంపిక్ డే రన్ సాగింది. ఆదివారం స్థానిక కొండారెడ్డి బురుజు వద్ద ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్యారీస్‌లో జరిగే ఒలంపిక్స్ విజయవంతం చేసేందుకు కృషి చేయాలని అన్నారు. దేశంలో క్రీడలకు చాలా తక్కువ బడ్జెట్ కేటాయించడం సరికాదన్నారు. గత ఐదు సంవత్సరాల నుంచి క్రీడాభివృద్ధిలో రాష్ట్రం వెనుకబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్టేడియాలకు కేటాయించిన స్థలాలను ఈ మధ్య కాలంలో వేరే పనులకు ఉపయోగించుకుంటున్నారని ఆయన తెలిపారు. ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ డా.షేక్ మహబూబ్ బాషా మాట్లాడుతూ క్రీడాకారులకు ఎల్లవేళలా ప్రోత్సాహం అందిస్తానని ఆయన ప్రకటించారు. కర్నూలు క్రీడాకారులు ఆటపాటలతో సాగుతూ క్రీడాకారులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కలెక్టరేట్, రాజ్‌విహార్, కిడ్స్ వరల్డ్, కోట్ల సర్కిల్ మీదుగా కొండారెడ్డి బురుజు వరకు రన్ సాగింది. క్రీడాంశాల్లో గెలుపొందిన విద్యార్థులకు కప్, మెడల్స్‌తో పాటు ప్రశంసాపత్రాలు అందజేసి ఆయన అభినందించారు. అంతకుముందు చిన్నటేకూరు, డీడీపాడు విద్యార్థులు చేసిన కార్యక్రమాలను పలువురిని అబ్బురపరిచాయి. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు క్రీడా సంఘాల ప్రతినిధులు సి.హర్షవర్ధన్, దాసరి సుధీర్, గంగాధర్, జాఫర్ మున్నా, వేణుగోపాల్, షేక్ నబీ, నాగరత్నమయ్య, విజయ్ కుమార్, గుడిపల్లి సురేందర్, పరశురాముడు, నవీన్, వెంకటేశ్, రాఘవేంద్ర, చిన్న సుంకన్న, ప్రసాద్, ప్రభాకర్, చంద్రమల్లి, మధు, అశోక్ చంద్ర పాల్గొన్నారు.

అంధత్వాన్ని ఆత్మవిశ్వాసంతో అధిగమించాలి



అమ్మ అంధుల పాఠశాలకు నిత్యావసర వస్తువులు అందిస్తున్న డా.శంకర్‌శర్మ

కర్నూలు(హాస్పిటల్), జూన్ 23: అంధత్వాన్ని శాపంగా భావించకుండా ఆత్మవిశ్వాసంతో అధిగమించాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.శంకర్‌శర్మ అన్నారు. కర్నూలు మండలం పసుపుల గ్రామం వద్ద ఉన్న అమ్మ అంధుల పాఠశాల విద్యార్థులకు ఒక నెల రోజులకు సరిపోయే విధంగా నిత్యావసర వస్తువులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ అంధుల పాఠశాలలో విద్యార్థులకు చూపు లేకపోయినప్పటికీ తమ జ్ఞాన నేత్రంతో ప్రపంచాన్ని చూడగలగడం అభినందనీయమన్నారు. అంధత్వంతో బాధపడే వారికి అక్షరజ్ఞానాన్ని పెంపొందించేందుకు లూయిస్ బ్రెయిలీ రూపొందించిన ప్రత్యేక లిపి వారి జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. అంధుల కోసం ఆశ్రమం నిర్వహించడం కష్టమని, అనునిత్యం వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఈ కేంద్రం నిర్వాహకుడు సుధాకర్‌ను నిజంగా అభినందిస్తున్నానని అన్నారు.

దివ్యాంగులను ఆదుకుంటాం

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), జూన్ 23: దివ్యాంగులకు అండగా ఉండేందుకు తమ వంతు సహకారం అందిస్తున్నట్లు భారత్ వికాస్ పరిషత్ కన్వీనర్ రేగూరు బాలకృష్ణ ఆదివారం తెలిపారు. ప్రమాదవశాత్తుగాని, పోలియో వల్లగాని కాళ్లు, చేతులు కోల్పోయిన దివ్యాంగులకు భారత్ వికాస్ పరిషత్, కర్నూలు తుంగభద్ర, హంద్రీ శాఖల ఆధ్వర్యంలో జూలై 7న ఉచితంగా కృత్రిమ కాళ్లు, చేతులు అందజేసేందుకు కొలతల శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అవసరార్థులు అవసరమైన దివ్యాంగులు 8142550143, 9491416299 లను సంప్రదించాలని కోరారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆరోగ్యం



ఉషూ పోటీలను ప్రారంభిస్తున్న డా.భాస్కర్ రెడ్డి

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 23: మార్షల్ ఆర్ట్స్‌తో మానసికోల్లాసం ఇస్తాయని హోమియోపతి వైద్యుడు డా.కే.భాస్కర్ రెడ్డి అన్నారు. నగరంలోని కింగ్ మార్కెట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ఉషూ ఎంపిక పోటీలకు అతిథిగా ఆయన హాజరైయ్యారు. ఆత్మరక్షణకు ఉషూ క్రీడ అవసరమన్నారు. ఉషూ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ నెల 28, 29 తేదీల్లో రాజమండ్రిలో జరిగే జూనియర్ రాష్ట్ర స్థాయి ఉషూ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాలని సూచించారు. వైస్ ప్రెసిడెంటు టీ.కృష్ణ, నాగరాజు, శ్రీనివాసులు, సుధాకర్, అమితేశ్వర్, పావని, కార్యదర్శి, టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

డాక్టర్ ఎం. హరికిషన్‌కు 'తెలుగు బంధు' పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకుంటున్న హరికిషన్

కర్నూలు(కల్చరల్), జూన్ 23: కర్నూలుకు చెందిన ప్రముఖ కథా రచయిత డాక్టర్ ఎం. హరికిషన్ తెలుగు భాషా సాహిత్యానికి చేసిన విశిష్ట సేవలను గుర్తిస్తూ హైదరాబాదుకు చెందిన తెలుగు అభివృద్ధి సమితి సంస్థ 'తెలుగు బంధు' పురస్కారం ప్రదానం చేసింది. ఆదివారం హైదరాబాదులోని రవీంద్రభారతి ఆడిటోరియంలో జరిగిన సాహితీవేత్తల సభలో ప్రముఖ సాహితీవేత్త, విశ్రాంత ఎస్కేయూ వీసీ పద్మశ్రీ ఆచార్య కొలుకలూరి ఇనాక్, తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ టి. గౌరీశంకర్‌ల చేతుల మీదుగా డాక్టర్ ఎం. హరికిషన్ ఈ పురస్కారం అందుకున్నారు. తెలుగు సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్రను వేసుకున్న డాక్టర్ ఎం. హరికిషన్ సామాజిక సమస్యలపై అనేక కథలు రాశారు. బాలల కోసం ప్రత్యేకంగా 50కి పైగా పుస్తకాలు స్వయంగా రాసి ప్రచురించారు. రాయలసీమ కథా సాహిత్యం పాఠకులకు చేరువ చేసేందుకు 'రాయలసీమ కథలు' పేరుతో సంకలనాలు వెలువరిస్తున్నారు. అలాగే రాయలసీమ ప్రాంతానికి చెందిన కథా రచయితలను, కవులను పరిచయం చేస్తూ వారి కథలు, కవితలతో కూడిన అనేక సంకలనాలు ముద్రించారు. అంతరించిపోతున్న జానపద సాహిత్యాన్ని నేటి తరం బాలలకు అందించేలా కృషి చేస్తూ, 17కు పైగా జానపద కథల పుస్తకాలు, బాలలు సులువుగా తెలుగు భాషను నేర్చుకునేలా సంయుక్త అక్షరాలు లేకుండా, ఒత్తులు లేకుండా కథలు, గేయాలు రచించారు. రచయిత ఎం. హరికిషన్‌కు తెలుగు బంధు పురస్కారం రావడం పట్ల జిల్లాకు చెందిన పలువురు రచయితలు, కవులు, కళాకారులు హర్షం వ్యక్తం చేశారు.

అనంతపురం జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా జి.నాగమణి

● సన్మానం చేసిన హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు



నర్సింగ్ సూపరింటెండెంట్ జి.నాగమణిని సన్మానిస్తున్న నర్సులు

కర్నూలు(హాస్పిటల్), జూన్ 23: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2గా పని చేస్తున్న జి.నాగమణి అనంతపురం జీజీహెచ్ గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందింది. ఈ మేరకు పదోన్నతిపై వెళ్తున్న జి.నాగమణిని హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని నర్సింగ్ ఆఫీసులో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెడ్ నర్సులు కాంతమ్మ, ఉమా, కాకినాడ, లీలావతి, పీజే మనోరంజని, ఆదిలక్ష్మి, ఉమామహేశ్వరి, పద్మావతమ్మ, నిర్మల, శ్యామల, స్టాఫ్ నర్సులు శాంతిలత, రమణిదేవి పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ హ్యాండ్‌బాల్ దినోత్సవం

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 23: హ్యాండ్‌బాల్ కర్నూలు డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని అవుట్‌డోర్ స్టేడియంలో ప్రపంచ హ్యాండ్‌బాల్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి డా.రుద్రరెడ్డి ఇంటర్నేషనల్ ప్లేయర్ వెంకటేశ్, సీనియర్ క్రీడాకారులు మాధవరావు, హసీనాలు హాజరై కేక్‌ను కట్ చేసి క్రీడాకారులకు పంచారు. క్రీడాకారుల సంక్షేమానికి జిల్లా సంఘం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు.

వృత్తి విద్యాకోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 23: వృత్తి విద్యా కోర్సులు డీఎంఎల్‌టీ, డీఎంఎస్‌టీ, డీఓఏలకు ధరఖాస్తు చేసుకోవాలని పద్మావతి పారా మెడికల్ కళశాల విరుపాక్షి, ప్రిన్సిపాల్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ నైపుణ్యం పెంపొందించి త్వరగా విద్యార్థులు ఉపాధి పొందే కోర్సులకు ప్రభుత్వం ఈ ఏడాది అనుమతి లభించింది అన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న వారు డిప్లమా ఇన్ ల్యాబ్ టెక్నీషియన్ (డీఎంఎల్‌టీ), డిప్లమా ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్మెంట్ ఆపరేషన్ థియేటర టెక్నీషియన్ (డీఎంఎస్‌టీ), డిప్లమా ఇన్ ఆప్తమాలిక్ అసిస్టెంట్ (డీఓఏ)లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 77806 02643 నెంబర్లను సంప్రదించవచ్చు సూచించారు.

అంబా భవాని ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం


ఆలయ నూతన కార్యవర్గ సభ్యులు

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 23: అంబా భవాని ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడు జిందే శంకర్ అన్నారు. ఆదివారం పెద్ద శక్తిగుడి కలిచినిపేట అంబా భవాని ఆలయ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా జిందె శంకర్, ఉపాధ్యక్షుడిగా కేందోలే ఆదిశేషు, కార్యదర్శిగా జిందే హుబ్బల్లి శంకర్, సహాయ కార్యదర్శిగా సింగాడే రఘునాథ్, కోశాధికారి సరోదే వినోద్‌కుమార్, సహాయ కోశాధికారి పాంద్రే మోహన్, అకౌంటెంట్‌గా జీరంగీ నాగరాజు, కామలే వెంకోబరావుతో పాటు జిహేశ్వర సమాజ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎస్టీ నాగరాజు, ఉపాధ్యక్షుడిగా అంబల్‌దాగే యువరాజ్, కార్యదర్శిగా సఫరే మహదేవ్, సహాయకార్యదర్శి పొందే లక్ష్మణ్, కోశాధికారి, రామకృష్ణ, అంబాజీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

నిధుల మంజూరుకు వినతి


ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆదోని ఎమ్మెల్యే

ఆదోని టౌన్, జూన్ 23: ఆదోని పట్టణంలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ నిర్మాణం వేగవంతంగా పూర్తి కావడానికి అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయడంలో సహకరించాలని రాష్ట్ర విద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను అమరావతిలో కలిసి కోరినట్లు ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీను ఈ ఎడాది నుండే ప్రారంభించడానికి మెడికల్ కౌన్సిల్‌లో అడ్మిషన్ల కోసం సీఫారసు చేయాలని కోరడం జరిగిందని, ప్రభుత్వ ఆసుపత్రిని బోధన ఆసుపత్రిగా మార్చడంతో అందుకు అవసరమైన స్పెషలిస్టులను నియమిస్తూ, నూతన వైద్య పరికరాలను ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు.

తాలుకా టెక్నికల్ అసిస్టెంట్ల అధ్యక్షుడిగా మహేష్

మద్దికెర, జూన్ 23: పత్తికొండ తాలుకా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు యూనియన్ అధ్యక్షుడిగా ఎల్.మహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మద్దికెరలో పత్తికొండ డివిజన్ టెక్నికల్ అసిస్టెంట్ల యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 8 మండలాలకు చెందిన టెక్నికల్ అసిస్టెంట్లు సమావేశమై సభ్యులను ఎన్నుకున్నారు. తాలుకా ఉపాధ్యక్షులుగా కే.మారుతి, కార్యదర్శిగా బి.రాముడు, కోశాదికారిగా బి.సుధాకర్, సహాయ కార్యదర్శిగా ప్రభాకర్, గౌరవ సలహాదారులుగా నాగన్న, వెంకప్ప, ఉలిగప్ప, కృష్ణమూర్తి, ఎం.శివరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వేదవతి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలి : సీపీఎం

ఆలూరు రూరల్, జూన్ 23: రాష్ట్ర ప్రభుత్వం వేదవతి ప్రాజెక్టును 8 టీఎంసీల సామర్థ్యంతో నిర్మాణం చేపట్టాలని సీపీఎం సీనియర్ నాయకులు నారాయణ స్వామి. మండల కార్యదర్శి షాకీర్ అన్నారు. ఆదివారం జ్యోతిబసు భవనం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు జిల్లాలోని ఆలూరు పూర్తిగా వెనుకబడిన ప్రాంతమని, తాగునీరు, సాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం వేదవతి ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు చేపట్టారని తెలిపారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక నిధులు కేటాయించకపోవడంతో పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నాయుడు వేదవతి ప్రాజెక్టుకు నిధులు కేటాయించి, నిర్మాణం పనులు చేపట్టి, లక్ష ఎకరాలకు సాగునీరు అందించాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

కోసిగి, జూన్ 23: మంత్రాలయం నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని మంత్రాలయం టీడీపీ నాయకుడు ఎన్.రాఘవేంద్రరెడ్డి ఆదివారం సీఎం చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, కర్నూలు మంత్రి టీజీ భరత్‌ను కోరారు. నియోజకవర్గంలో సాగు, తాగునీరు సమస్య అధికంగా ఉందని ప్రతి మండలంలో సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు నిర్మించి ప్రజలకు తాగునీరు అందించాలని, రైతులకు పంటలకై సాగునీరు అందించేందుకు కృషి చేయాలని కోరినట్లు రాఘవేంద్రరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాలుగు మండలాల టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, ఉల్లిగయ్య, ముత్తురెడ్డి, రామిరెడ్డి, సురేష్‌నాయుడు, బసలదొడ్డిఈరన్న ఉన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి శవం

ఆదోని, జూన్ 23: రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమైనట్లు రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ గోపాల్ తెలిపారు. శనివారం రాత్రి ఆదోని-ఇస్వి రైల్వే స్టేషన్‌లో మధ్య 498/23 కి.మీ దగ్గర 25 నుండి 30 ఏళ్ల మధ్య వయసున్న గుర్తు తెలియన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

చెలరేగిన చిల్లర దొంగలు

● మోటార్ సైకిల్, ఆటోల్లో పెట్రోలు బ్యాటరీలు ఎత్తుకెళ్తున్న వైనం

ఎమ్మిగనూరు టౌన్, జూన్ 23 : ఎమ్మిగనూరు పట్టణంలో చెలరేగిపోతున్న చిల్లర దొంగలు, ఆదివారం తెల్లవారుఝామున లక్ష్మీపేటలో ఒకే రోజు పది మోటర్ సైకిల్‌లో పెట్రోలు, బ్యాటరీల దొంగతనాలు పట్టణ వాసులను భయాందోళనకు గురిచేశాయి. లక్ష్మీపేట, సంజీవయ్య నగర్ కాలనీలో ఇళ్లల్లో స్థలాలు లేక ఇంటి ముందు వాహనాలను నిలుపుకుంటున్నారు, ఇదే అదునుగా చిల్లర దొంగలు చెలరేగిపోతున్నారు బయట నిలుపుకున్న వాహనాలను లక్ష్యంగా చేసుకొని అర్ధరాత్రి దాటాక చేతివాటం చూపిస్తున్నారు. మోటర్ సైకిల్ ,ఆటోలలో పెట్రోలు మరియు బ్యాటరీలు,చక్రాలను,వాహనాలకు సంబందించిన పరికరాలను రాత్రికి రాత్రే ఎత్తుకెళ్లిపోతున్నారు. పోలీసులు గ స్తీ రాత్రి సమయాలలో కేవలం ప్రధాన రహదారులకే పరిమితం అవుతున్నారు. జనసంచారం , మురికివాడ కాలనీలు, ఎట్టణ వీధులలో గస్తీ లేకపోవడం వలన చిల్లర దొంగలు చెలరేగి ఎక్కడికక్కడ దొంగతనాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. కాలనీ వాసులు మాట్లాడుతూ పోలీసులు ఇప్పటికైనా వీటిపై దృష్టి సారించి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు.

హాస్టళ్లపై కూరగాయల ధరల భారం

● పెరిగిన కూరగాయల ధరలు
● సంక్షేమ హాస్టళ్లకు కూరగాయలు సరఫరా చేయలేమంటున్న ఏజెన్సీలు
● భారంగా మారిన మధ్యాహ్న భోజన నిర్వహణ


భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు



ఆలూరు, జూన్ 23 : మార్కెట్లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. వానాకాలంలో ఎండలకు దీటుగా వాటి ధరలు సైతం సామాన్యులకు చుక్కలు చూపుతున్నాయి. ఆకు కూరలు, కూరగాయలు ఏమిముట్టుకున్నా రూ.100 పైమాటే. ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో సంక్షేమ హాస్టళ్లకు కూరగాయలు సరఫరా చెయ్యలేమంటూ ఏజెన్సీ నిర్వాహకులు చేతులెత్తేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టల్స్‌తో పాటు గురుకులాలు, కేజీబీవీ, మోడల్ హాస్టల్స్‌కు ప్రభుత్వం టెండర్లు నిర్వహించి ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు కూరగాయల సరపరా బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు కూరగాయలు ధరలు తగ్గితే మాత్రం ఏజెన్సీలకు మిగులుబాటు అవుతుంది. ధరలు పెరిగితే మాత్రం నష్టం కలుగుతుందని బావిస్తున్న ఏజెన్సీలు, కొన్ని హాస్టల్స్‌కు కూరగాయల సరపరా సక్రమంగా చేయడం లేదు. దీంతో స్వంతంగా డబ్బు చెల్లించి కూరగాయలు కొనే పరిస్థితి నెలకొంది.

● భారంగా మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ

ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, మోడల్ స్కూల్స్ జిల్లా పరిషత్ స్కూల్స్‌లో మధ్యాహ్న భోజన పథకం కొనసాగుతోంది. అయితే, పెరిగిన ధరలు చూసి.. ఇవేం ధరలు...? స్కూల్ పిల్లలకు ఎలా భోజనం పెట్టాలి..? అంటూ ఏజెన్సీ నిర్వాహకులు వాపోతున్నారు... మార్కెట్‌లో టమోటా కేజీ రూ.120, ఉల్లిగడ్డ కేజీ రూ.50, మిగతా కూరగాయలు కూడా కేజీ రూ.60పై మాటే. దీనికి తోడు వంటచెరుకు కూడా కొనాల్సి ఉంటుంది. దీంతో ప్రభుత్వం ఇచ్చే అరకొర నిధులు ఏ మాత్రం సరిపోవని మధ్యాహ్న భోజన ఏజెన్సీలు ఆందోళన చెందుతున్నారు. పెరిగిన ధరలతో ఎం చేయాలో అర్థం కావడం లేదంటూ తలలు పట్టుకుంటున్నారు.

ముదురుతున్న వివాదం

● అక్రమకట్టడం కూల్చివేత 21మందిపై కేసు నమోదు



దేవనకొండ ,జూన్ 23 : రోడ్లపై అక్రమణలు వివాదాలకు దారితీస్తున్నాయి. కాలనీ వాసులకు వెళ్లే మార్గం ఇబ్బందికరంగా మారడంతో అందరూ ఏకమై నిర్మాణాన్ని కూల్చివేయడంతో దేవనకొండ పోలీసులు 21 మందిపై కేసు నమోదు చేసిన ఘటన మండలంలోని జిల్లెలబుడకల గ్రామంలో చోటుచేసుకోంది. కమ్మరి గేరి వీధిలో రామాంజినేయులు అనే వ్యక్తి తనకున్న స్థలం పరిది దాటి రోడ్డుపై ఇంటి నిర్మాణం చేపట్టడంతో కాలనీవాసులందరూ ఏకమై నిర్మాణాన్ని కూల్చివేశారు. గ్రామస్థులు, పంచాయతీ అధికారులు సర్వే చేయంచగా రామాంజినేయులు తనకున్న స్థలం కాదని దాదాపు రోడ్డుపై తొమ్మిది అడుగులు ముందకొచ్చి ఇంటినిర్మాణం చేసినట్లు అధికారులు చెబుతున్నారు. గ్రామాల్లో అక్రమ నిర్మాణాలతో ప్రజలకు మౌలిక పనులు చేసుకునేందుకు అడ్డుగా పరిణమిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో పలు వివాదాలకు దారితీసే పరిస్థితులు నెలకొంటున్నాయి.

21 మందిపై కేసు నమోదు చేశాం : సీఐ శ్రీనివాసులు

తన ఇంటినీ కూల్చినట్లు రామాంజినేయులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లెలబుడకల గ్రామస్థులు 21 మందిపై కేసు నమోదు చేశాం. అన్ని కోణాల్లో విచారించి చర్యలు తీసుకుంటాం.

మూడుసార్లు నోటీసులు ఇచ్చాం : శివశంకర్ సింగ్

గ్రామస్తుల ఫిర్యాదు మేరకు స్థలం సర్వే చేయించాము. రామాంజినేయులు తనకున్న స్థలం కాదని 9 అడుగులు ముందుకు నిర్మాణం చేపట్టారు. దీంతో మూడుసార్లు నోటీసులు ఇచ్చినా తీసుకోలేదు.

శవం తీసుకెళ్లే పరిస్థితి లేదు : జనర్ధన్ కాలనీవాసి

అక్రమ ఇంటి నిర్మాణంతో కాలనీలో ఎవ్వరైనా చనిపోతే శవం తీసుకెళ్లెందకు కూడా స్థలం లేనంతగా అక్రమ కట్టడంతో ఇబ్బందులు పడుతున్నాం. అక్రమ కట్టడాలపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

సినీనటుడు సుమన్ నేడు పత్తికొండకు రాక



పత్తికొండ, జూన్ 23 : ప్రముఖ సినీ నటుడు సుమన్ సోమవారం పత్తికొండకు రానున్నారు. పట్టణంలోని అబేద్కర్ సర్కిల్ రాఘవరెడ్డి కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎద్దుల కాటన్స్ వస్త్రదుకాణాన్ని ఆయన ప్రారంభించనున్నారు. ఎద్దులకాటన్స్‌గా రాష్ట్రవ్యాప్తంగా తమదుకాణాలు ఏర్పాటు చేస్తున్నామని కంపెనీ బ్రాడ్ అంబాసిడర్‌గా సుమన్ ప్రారంభోత్సవానికి వస్తున్నట్లు ఎండీ సుర్యారెడ్డి తెలిపారు.

15 రోజులుగా నీరులేదు

● కొత్త పేటలో నిలిచిపయిన తాగునీటి సరఫరా
● నీటి మోటర్ కాలిపోయినా పట్టించుకోని అధికారులు


కొత్తపేటలో బోరుబావి వద్ద నీటికోసం తోపడు బండ్లు

హొళగుంద, జూన్ 23: గ్రామాల్లో గుక్కెడు నీటికోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలోని కొత్తపేట గ్రామంలో పంచాయతీ అధికారులు 15 రోజులుగా నీటి సరపరా చేయకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ శివారులోని బోరుబావుల వద్దకు వెళ్లి తోపుడు బండ్లు, సైకిళ్ల ద్వారా నీరు తెచ్చుకొని దాహం తీర్చుకుంటున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి సరఫరా చేసే మోటార్ కాలిపోయి 15 రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా మోటారు రిపేరి చేయించి నీటి సమస్య తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ అధికారి మహమ్మద్ షఫిని వివరణ కోరగా.. మోటర్ మరమ్మతుకు మెకానిక్‌ను పంపించామని, నీటి సమస్య త్వరలో తీరుస్తామని తెలిపారు.

సంస్కృత విద్యావ్యాప్తికి శ్రీమఠం కృషి

● పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు


న్యాయ సుధ పాఠాన్ని ప్రారంభిస్తున్న పీఠాధిపతి, పండితులు

మంత్రాలయం, జూన్ 23: సంస్కృత విద్యావ్యాప్తి కోసం రాఘవేంద్రస్వామి మఠం విశేష కృషి చేస్తోందని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. ఆదివారం రాత్రి రాఘవేంద్రస్వామి మూల బృందావనం, గర్భగుడి ముందు రాఘవేంద్రస్వామి రచించిన న్యాయ సుధ పఠానికి ఎన్నికైన ఐదుగురు విద్యార్థులతో 8వ బ్యాచ్‌ను పీఠాధిపతి ప్రారంభించారు. ఎన్నికైన విద్యార్థులకు విధి విధానాలను తెలియజేశారు. పీఠాధిపతి మాట్లాడుతూ సంస్కృత విద్య ఖండాంతర వ్యాప్తి చేసేందుకు విశేష కృషి చేస్తున్నామన్నారు. కంప్యూటర్ యుగంలో సంస్కృత విద్య అధిక ప్రాధాన్యత సంతరించుకుంటోందని, భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలు, హిందూ ధర్మ పరిరక్షణ, సనాతన హిందూ ఆచారాలను కాపాడేందుకు శ్రీమఠం అన్ని రకాలుగా కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గురుసార్వభౌమ సంస్కృత విద్యాపీఠం ప్రిన్సిపల్ రమణారావు, వాధిరాజాచార్, అర్చక రమాకాంతాచార్, జోన్ రాఘవేంద్రాచార్, వెంకటేశాచార్, కడప రాఘవేంద్రాచార్, ద్వారకనాథాచార్, కనకాచలాచార్, పురోహిత్ వేధమాధవాచార్‌లు పాల్గొన్నారు.

ఇదీ ములుగుందం దుస్థితి

● జలమయంగా ఇంటర్నల్ రోడ్లు
● డ్రైనేజీలు లేక నిలిచిన వర్షపు నీరు
● స్తంభించిన రాకపోకలు
● రోగాల బారిన పడుతున్న గ్రామస్థులు


వర్షపు నీరు నిలిచి బురద మడుగుగా ఉన్న రహదారి

ఆస్పరి, జూన్ 23: ఈ చిత్రాల్లో కనిపిస్తున్నది ములగుందంలోని పది కాలనీల అంతర్గత రహదారులు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇలా బురదమడుగులుగా మారాయి. ప్రధానంగా గ్రామంలో కురిసిన వర్షపు నీరు, ఇళ్లల్లోని వృధా నీరు వెళ్లేందుకు డ్రైనేజీలు నిర్మించకపోవడంతో ఇలా నీటితో నిండిపోయాయని గ్రామస్థులు వాపోతున్నారు. చిన్నపాటి వర్షాలకే రోడ్లన్నీ చిత్తడిగామారి దుర్గంధం వెదజల్లుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వృథానీరు, వ్యర్థ పదార్థాల కారణంగా దోమలకు ఆవాసమయ్యాయి. వర్షపు నీరు నిలువ ఉండడంతో విషపురుగులు, దోమల లార్వా వృద్ధి చెందుతున్నాయని భయాందోళనలు వ్యక్తం చేశారు. గ్రామంలో సుమారు పదివేల జనాభా ఉన్నా ఇక్కడ డ్రెయిన్లు లేక దుర్గంధం వెదజల్లుతూ దోమలు విజృంభిస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారుల్లో చలనం లేకపోవడం శోచనీయం.




వర్షపు నీరు నిలవడంతో గ్రామంలోని అంతర్గత రహదారుల దుస్థితి

● డ్రైనేజీలు నిర్మించాలి

మా కాలనీలో వానలు పడితే కాలనీ అంతా కాలనీ రోడ్లన్నీ నీటితో నిండుతాయి. వర్షపు నీటికితోడు ఇళ్లల్లోని వృథా నీరు గ్రామ వెలుపలకు వెళ్లేలా డ్రైనేజీలు నిర్మించాలి.
- ఈరన్న, పెద్దగేరి ములుగుందం

● జారి కింద పడితే దిక్కెవరు...?

గ్రామ రోడ్లన్నీ చిన్నపాటి చినుకులకే ఇలా మారాయి. ఇంతకుముందే చిత్తడి రోడ్లపై నడిచి కింద పడ్డాను. జరగరాని ప్రమాదం జరిగితే మాకు దిక్కు ఎవరు?
- సుంకమ్మ, వృద్ధురాలు, ములుగుందం

యువకులకు పరుగు పందెం పోటీలు


పల్లెపాడులో పరుగు పందెంలో యువకుల పరుగు

కోసిగి, జూన్ 23: ఏరువాక పౌర్ణమి సందర్భంగా రెండు రోజులుగా నిర్వహిస్తున్న పరుగు పందెంలో కోసిగికి చెందిన నాడిగేని రాజు సత్తాచాటాడు. రాజు పరుగుకి మిగతా వారు దరిదాపుల్లో రాలేదు. శని, ఆదివారాల్లో నిర్వహించిన 6 కి.మీల పరుగు పందెం పోటీల్లోని కోసిగిలోని 6వ వార్డుకు చెందిన నాడిగేని రాజు రెండు రోజుల పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి శభాష్ అనిపించుకున్నాడు. రాజుకు పలువురు గ్రామస్థులు పూలమాలలు, శాలువలతో సన్మానించారు. డప్పు వాయిద్యాల మధ్య గ్రామ పురవీదుల గుండా రాజును ఊరేగించారు. అనంతరం పల్లెపాడు గ్రామంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పరుగు పందెం పోటీలో లక్ష్మన్న అనే యువకుడు మొదటి స్థానంలో నిలిచారు. రెండు రోజులుగా లక్ష్మన్నకు తిరుగులేకుండా పోయింది. అందరికంటే ముందుగా లక్ష్మన్న పరుగెత్తి విజేతగా నిలిచాడు.

ఎద్దుల పరుగు పందేలు

మద్దికెర, జూన్ 23: ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని కనుమ పండుగ నాడు గ్రామంలో నిర్వహించిన ఎద్దుల పండుగ పందేలు రసవత్తరంగా జరిగాయి. ఆదివారం స్థానిక మద్దమ్మ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన ఎద్దుల పరుగు పందేలలో కవిరెడ్డి వీధికి చెందిన కవిరెడ్డి పాండు అనే రైతుకు చెందిన ఎద్దులు విజయం సాదించడంతో ఊరేగింపు నిర్వహించారు.

గుడికల్లులో పరుగుపందెం పోటీలు

ఎమ్మిగనూరు రూరల్ : గుడికల్లు గ్రామంలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని పరుగుపందెం పోటీలు నిర్వహించారు. ఈ గ్రామంలో ఏరువాక పౌర్ణమి వచ్చిందంటే గ్రామంలోని పెద్దలు, యువకులు గ్రామీణ క్రీడలకు ప్రాధాన్యతను ఇస్తారు. ఇందులో భాగంగానే ఆదివారం ఉదయం లాంగ్‌జంప్‌తో పాటు పట్టణంలోని శివ సర్కిల్ నుండి గుడికల్లు గ్రామంలోనికి యువకులకు పరుగుపందెం పోటీలు నిర్వహించారు.

ఎద్దుల పారువేటలో ఇరువర్గాల ఘర్షణ

● 10 మందికి గాయాలు ● 24 మందిపై కేసు నమోదు

మంత్రాలయం, జూన్ 23: మంత్రాలయం మండలంలోని చౌలహళ్లి గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా నిర్వహించే ఎద్దుల పారువేటలో శనివారం ఓ చిన్నపాటి ఘర్షణ చోటు చేసుకుంది. ఆదివారం మరోసారి ఘర్షణ తలెత్తడంతో ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ దాడులకు దిగారు. కట్టెలు, రాళ్లతో ఒకరిపై ఒకరు కొట్టుకోవడంతో 10 మందికి గాయాలయ్యైనట్లు మాధవరం ఎస్ఐ క్రిష్ణమూర్తి తెలిపారు. వైసీపీ ఎంపీటీసీ ఈరన్న ఒక వర్గం కాగా, టీడీపీ నాయకులు బోయ క్యాతయ్య, ఎంపీటీసీ బోయ ఈరన్న మరో వర్గం ఒకరి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఇరు వర్గాలకు చెందిన 24 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడులలో గాయపడిన వారిని చికిత్స నిమ్మితం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుత్రికి తరలించారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాధవరం ఎస్ఐ క్రిష్ణమూర్తి తెలిపారు.

ఆలూరు అభివృద్ధికి నిధులు కేటాయించాలి

● సీఎం చంద్రబాబుకు టీడీపీ నేత వీరభద్రగౌడ్ వినతి


చంద్రబాబును కలిసి సమస్యలు విన్నవిస్తున్న వీరభద్ర గౌడ్

ఆలూరు, జూన్ 23: వెనుకబడ్డ ఆలూరు నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయిం టీడీపీ సీనియర్ నేత వీరభద్ర గౌడ్ సీఎం చంద్రబాబును కోరారు. ఆదివారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో సీఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలూరులో ఓటమికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారన్నారు. ఆలూరు ప్రాంతంలో వలసల నివారణకు చర్యలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినట్లు టీడీపీ నేత వీరభద్ర గౌడ్ తెలిపారు.

సీఎంను కలిసిన రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి

పెద్దకడుబూరు : ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి నరవరమాకాంతరెడ్డి, జిల్లా తెలుగు మహిళా కార్యదర్శి నరవ శశిరేఖ కలిశారు. సీఎంను మర్యాద పూర్వకంగా కలిసిన రమాకాంతరెడ్డి దంపతులు సీఎంతో మాట్లాడారు. కస్తూరిభాగాంధీ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌తో పాటు తెలుగు, ఇంగ్లీష్ మీడియంకు కూడా అనుమతి ఇవ్వాలని, పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీఎంను కోరినట్లు తెలిపారు.

ఘనంగా ముఖర్జీ బలిదాన దినోత్సవం

ఆదోని టౌన్, జూన్ 23: బీజేపీ (జన సంఘ్) వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ప్రజలలోకి తీసుకుపోవడంలో యువత పాలుపంచుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, ఆదోని అసెంబ్లీ కన్వీనర్ శ్రీరాములు, కో కన్వీనర్ నాగరాజు గౌడ్ అన్నారు. ఆదివారం శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన దినోత్సవ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ముఖర్జీ చేసిన సేవలు మరువరానివని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సాయికుమార్, మండల అధ్యక్షుడు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షలో గౌతమ్‌రెడ్డి ప్రతిభ

తుగ్గలి, జూన్ 23: దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గౌతమ్ కుమార్ రెడ్డిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఆదివారం మండల పరిధిలోని రాంపల్లెకు చెందిన హనుమంతురెడ్డి, భాగ్యలక్ష్మి దంపతుల కుమారుడు గౌతమ్ రెడ్డి నీట్ ఫరీక్షలో 720/675 మార్కులు సాదించి దేశ వ్యాప్తంగా 11,190వ ర్యాంకు వచ్చింది. దీంతో త్వరలోనే ఎంబీబీఎస్ కోర్సులో చేరి డాక్టరై పేదలకు సేవ చేస్తానని ముఖ్యంగా గ్రామీణులకు వైద్యసేవలందిస్తానని తెలిపారు.

మరదలుపై బావ దాడి

ఎమ్మిగనూరు రూరల్ , జూన్23: మండల పరిధిలోని కందనాతి గ్రామంలో మరదలపై బావ దాడి చేసిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామీణ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి వివరాల మేరకు గ్రామానికి చెందిన తిమ్మప్ప తమ్ముడి భార్య అయిన యశోదపై దాడి చేశారు. ఇంటి మరుగుదొడ్డి స్థలం విషయంలో ఇరువురికి వాగ్వాదం జరగ్గా తిమ్మప్ప తన తమ్ముడి భార్య యశోదపై దాడి చేశారని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం ఎస్ఐ తెలిపారు.

మానవులందరిదీ ఒకే మతం

కౌతాళం, జూన్ 23: సమాజంలో కులమతాలు లేవని వాటిని మానవులే సృష్టించారే తప్ప భగవంతుడు కాదని బ్రహ్మకుమారి ఈశ్వరి సంస్థ సభ్యులు తెలిపారు. స్థానిక బ్రహ్మకుమారి కార్యాలయంలో ఆ సంస్థ వ్యవస్థాపకురాలిలో ఒకరైన మమ్మా వర్ధంతి దినోత్సవం, అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకుడు, జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. అనంతరం మమ్మా వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేశారు.

టీఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

పత్తికొండ టౌన్, జూన్ 23: ఉపాధి హామీ పథకంలో గత 17 సంవత్సరాలుగా పని చేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని పత్తికొండ డివిజన్ టెక్నికల్ అసిస్టెంట్ల అసోసియేషన్ అధ్యక్షులు మహేష్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం పత్తికొండ పట్టణంలో టెక్నికల్ అసిస్టెంట్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత లేదన్నారు. పీఆర్సీని అమలు చేసి ఉద్యోగులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని కోరారు.